క్లుప్తంగా

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ ఈనెల 10న ఖమ్మంలో మందకృష్ణమాదిగ చేయనున్న పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునిల్ పిలుపునిచ్చారు. బుధవారం తాండ్ర క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మాదిగల సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఎస్సీ వర్గీకరణకు అండగా ఉండే బీజేపీకి మాదిగ, మాదిగ ఉపకులాలు ఓటేసి గెలిపించాలని కోరారు. మాదిగల అస్థిత్వాన్ని దెబ్బతీస్తున్న కాంగ్రెస్‌ను ఓడించడమే మాదిగల పంతం అన్నారు. ఈ సమావేశంలో నాయకులు క్రాంతి, అశోక్, నరసింహారావు, హనుమంత రావు, వెంకటేశ్వర్లు, నాగభూషణం, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

బారుగూడెం వాసికి గుండె మార్పిడి

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడేనికి చెందిన భాస్కర్‌కు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు మంగళవారం గుండె మార్పిడి చేశారు. భాస్కర్ గత కొంతకాలం క్రితం ప్రమాదానికి గురై గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో అదే ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సురేష్ గుండెను భాస్కర్‌కు అమర్చారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో వైద్యులు భాస్కర్‌ను డిశ్చార్జ్ చేశారు.

ఖమ్మం కోర్టు టైపిస్ట్ మృతి

ఖమ్మం లీగల్: ఖమ్మం కోర్టు ఆవరణలో గత 40 ఏళ్లుగా టైపిస్ట్‌గా పనిచేస్తున్న దస్తగిరి బుధవారం మరణించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, ఐలు రాష్ట్ర కార్యదర్శి, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, టీడీపీ లీగల్ సెల్ నాయకుడు మువ్వా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ లీగల్ సెల్ బిచ్చాల తిరుమలరావు, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకుడు జమ్ముల శరత్ కుమార్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పాల్గొని నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎమ్మెల్యే కోరంను కలిసిన జెడ్పీటీసీ



ఎమ్మెల్యే కనకయ్యతో జెడ్పీటీసీ

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను బుధవారం ఆయన నివాసంలో కామేపల్లి జెడ్పీటీసీ బానోతు వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జెడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన ఎమ్మెల్యేతో పాటు పాతలింగాల గ్రామంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డిని కలిశారు. పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వారు సూచించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాలోత్ శంకర్, ప్రేమ్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఐక్యతే లక్ష్యం

స్వతంత్ర అభ్యర్థి జోగ్రామ్‌నాయక్



వాకర్లతో మాట్లాడుతున్న జోగ్రామ్‌నాయక్

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలను ఐక్యం చేయడమే లక్ష్యంగా ఖమ్మం నుంచి పోటీ చేస్తున్నట్లు స్వతంత్ర అభ్యర్థి తేజావత్ జోగ్రామ్ నాయక్ తెలిపారు. నగరంలోని లకారం ట్యాంక్ బండ్, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో బుధవారం ఉదయం ఆయన వాకర్లతోపాటు గాంధీచౌక్, ఎన్టీఆర్ సర్కిల్‌లో అడ్డా కూలీలను కలిసి కుండ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం బంజారాభవన్‌లో విలేకరుల సమావేశంలో జోగ్రామ్‌నాయక్ మాట్లాడుతూ అంబేడ్కర్ వాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి హక్కుల సాధనకు కృషి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రచారంలో భాగంగా ఈనెల 10న నగరంలో నిర్వహించే ప్రదర్శనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో బానోతు సేనానాయక్, బానోతు సునీల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బాక్
వినోద	టిల్లు 2
సాయిరాం	ప్రసన్నవదనం
ఆదిత్య	శబరి
శ్రీనివాస	ఆ.. ఒక్కటి అడక్కు

- ఖమ్మంగాంధీచౌక్

పకడ్బందీగా పోలింగ్..



నేలకొండపల్లిలో పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేస్తున్న అధికారులు, సిబ్బంది(ఫైల్)

ప్రశాంత ఓటింగ్‌కు పటిష్ట చర్యలు

- పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి
- పాలేరులో వంద శాతం పోలింగ్ స్లిప్పులు పంపిణీ
- ప్రతీ బూత్‌కు రూ.2వేల చొప్పున అందజేత
- విస్తృత తనిఖీలతో అధికారులు బిజీబిజీ

నేలకొండపల్లి: ఓటర్లు పోలింగ్ కేంద్రాలను కనుక్కోవటానికి ఇబ్బంది లేకుండా ఎన్నికల సంఘం ముందస్తుగా ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు పంపిణీ చేసింది. ఈనేపథ్యాన పాలేరు నియోజకవర్గంలో నూరు శాతం పంపిణీ పూర్తయింది. ఈ నెల 13న జరగనున్న లోకసభ ఎన్నికలకు సంబంధించి అధికారులు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఇప్పటికే ఆయా మండలాల తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పాలేరు డివిజన్‌లోని తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల్లో పోలింగ్ స్లిప్పులు పంపిణీ వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. పాలేరు డివిజన్‌లో మొత్తం 2,39,653 మంది ఓటర్లకు గాను, 1,15,243 పురుషులు, 1,24,402 మంది స్త్రీలు, ఎన్ఆర్ఐ-19, సర్వీస్ ఓటర్లు 163 మంది ఉన్నారు. వీరిలో ఉద్యోగులు, దివ్యాంగులు, వయో వృద్ధులు ఇంటి వద్ద ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.

కేంద్రాల్లో సౌకర్యాలు పూర్తి..

పాలేరు నియోజకవర్గంలో మొత్తం 290 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో అధికారులు, పోలీసులు, ఇతర అధికారులకు వసతి, ఇతరాత్ర సౌకర్యాలతో ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అంతేకాక ఉచిత ఆటోలకు అంటించే పోస్టర్లతో సహా పోలింగ్ కేంద్రాలకు పంపించారు. ముందస్తుగా ఎన్నికల ఖర్చు కోసం ప్రతీ బూత్‌కు రూ. 2 వేల చొప్పున ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందించారు. పోలింగ్ రోజున టెంట్, మంచినీరు, కుర్చీలు, బల్లలు ఇతరత్రా ఖర్చుల నిమ్మిత్తం కొంత నగదును అందించారు. పంపిణీ స్లిప్పులు భద్రపరిచి పోలింగ్ రోజు గుర్తింపు కార్డుతో పాటు తీసుకెళ్లాలని అధికారులు ఓటర్లకు సూచిస్తున్నారు.

డివిజన్‌లో విస్తృత తనిఖీలు..

పాలేరు డివిజన్‌లో ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కలెక్టర్, కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి, జెడ్పీ సీఈఓ, ఇతరత్రా అధికారులు, సెక్టోరియల్ అధికారులు, పాలేరులోని అన్ని గ్రామాలను జల్లెడ పడుతున్నారు. తనిఖీలలో నగదు, మందు ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకుంటుండగా.. ఇందులో నేలకొండపల్లి, ఖమ్మం రూరల్‌లో నగదు, కూసుమంచిలో మద్యాన్ని స్వాధీనపర్చుకున్నారు.



కూసుమంచిలో తనిఖీలను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం..



ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు అన్ని సిద్ధం చేశాం. అధికారులు, సిబ్బందిని అప్రమతం చేశాం. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఓటర్లు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. పోలింగ్ నాడు ఓటరు స్లిప్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకెళ్లాలి.

– ఎం.యర్రయ్య, మండల కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి

సౌకర్యాలు బాగున్నాయి..



ఎన్నికల సంఘం ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే పోలింగ్ కేంద్రం, ఆటో ఉచిత ప్రయాణం లాంటి సౌకర్యాలు చాలా బాగున్నాయి. దీని వలన ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. మరో గంట సమయం పెంచటం చాలా మంచి విషయం.

– చిలకబత్తిని వీరబాబు, కవి, నేలకొండపల్లి

ప్రతి ఒక్కరూ సహకరించాలి..



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. శాంతి భద్రతల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. ఆదర్శ మండలంగా ఉండేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలి. నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– తోట నాగరాజు, ఎస్సై

రఘురాంరెడ్డిని లోక్‌సభకు పంపించండి

రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

ఖమ్మంమయూరిసెంటర్: 'రాజ్యసభ సభ్యురాలిగా తాను పార్లమెంటులో ఉన్నప్పటికీ.. రఘురామిరెడ్డిని లోక్‌సభకు పంపించాలని, ఆయన గెలుపు ఖాయమే అయినా మెజారిటీ కోసమే అందరి తాపత్రయం..'అని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యాఖ్యానించారు. రఘురామిరెడ్డిని ఎంపీగా గెలిపిస్తే జిల్లాలోని ముగ్గురు మంత్రుల సహాయ సహకారాలతో తామిద్దరం జిల్లాను ప్రత్యేకంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం పౌరసమితి అధ్యక్షుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఆధ్వర్యాన ఆయన నివాసంలో బుధవారం ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డి విజయం కోసం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలిస్తే కేంద్ర మంత్రి ఎలా అవుతారో రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ స్పష్టత ఇవ్వాలన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీ శ్రీరాముడిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్న మోదీ, భద్రాద్రి రామయ్యను ఎలా మరిచారో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కమ్మ మహాజన సంఘ అధ్యక్షుడు ఎర్నేని రామారావు, ప్రముఖ న్యాయవాది నిరంజన్ రెడ్డి, జహీర్ అలీ, బేబీ స్వర్ణకుమారి, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో స్పీడ్ పెంచిన రఘురాంరెడ్డి..

ఖమ్మంవన్‌టౌన్: ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రఘురాంరెడ్డి తన ప్రచారంలో స్పీడ్ పెంచారు. బుధవారం పలు ఆత్మీయ సమ్మేళనాలు, పలువురి ఇళ్లల్లో అల్పాహార విందుకు హాజరై తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. తొలుత రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి నివాసానికి వెళ్లగా.. ప్రచార సరళిపై చర్చించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగి రాందాస్ కృష్ణమూర్తి నివాసానికి వెళ్లారు. ఖమ్మం పౌర సమితి ఆధ్వర్యాన, కిసాన్ కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనంలో, రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. కార్పొరేటర్ దొడ్డా నగేష్, ఎండీ ముస్తఫా, ఆవుల సైదేశ్వరరావు, పులిపాటి ప్రసాద్, మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన రఘురాంరెడ్డి, తదితరులు

ఖమ్మంసహకారనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. బుధవారం ఖమ్మంలో నిర్వహించిన ఖమ్మం ప్రైవేట్ విద్యాసంస్థల సంఘం ఆత్మీయ సమావేశంలో తనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిలు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అందుకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యా సంస్థల అధినేత మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మువ్వా విజయబాబు, గుర్రం కాంతారావు, వీరారెడ్డి, హార్వెస్ట్ విద్యా సంస్థల అధిపతి రవిమారుత్, జిల్లాలోని విద్యా సంస్థల అధిపతులు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటాం..

ఖమ్మంఅర్బన్: తెలంగాణ సాధన కోసం కృషి చేసిన పోరాట యోధులందరికీ అండగా ఉంటామని కాంగ్రెస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని 1వ డివిజన్ ఖైకొండాయిగూడెం వద్ద నిర్వహించిన ఉద్యమ యోధుల ఆత్మీయ సమ్మేళనంలో వారు ప్రసంగించారు. నాడు తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించినా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హుస్సేన్, ఉపేందర్, డాక్టర్ కే.వీ.కృష్ణారావు, ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే వారి సంక్షేమాన్ని గాలికొదిలేశారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించాలని కోరుతూ.. నగరంలో 23వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం, 44, 45, 49, 50, 51 డివిజన్లలో రోడ్‌షో కార్నర్ మీటింగ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడం కోసం ఆచరణ సాధ్యం కానీ హామీలిచ్చి, గెలిచాక వాటిని అమలు చేయడం మరిచిందన్నారు. రైతు బంధుకు అదనంగా రైతు భరోసా రూ.15వేలు ఇస్తామన్నారని, కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టి గర్జించాకే రైతు బంధు ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నామా కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, పొన్నం వెంకటేశ్వర్లు, శీలంశెట్టి వీరభద్రం, జక్కుల లక్ష్మయ్య, జక్కుల వెంకటరమణ, శేషు, లింగనబోయిన సతీష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం

కామేపల్లి: మండల వ్యాప్తంగా కాంగ్రెస్,బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు తమ తమ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి తమ పార్టీ అభ్యర్థికే ఓటేయాలని కోరారు. ముచ్చర్ల గ్రామంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్ రెడ్డి చేతి గుర్తుకు ఓటేయాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి



మాట్లాడుతున్న మానవతారాయ్

ఖమ్మం మామిళ్లగూడెం: రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీతో పాటు బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ అన్నారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ కేయూజేఏసీ, ఓయూ జేఏసీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులను మోసం చేసిన బీజేపీని ఓడించి, దళితులంతా ఐక్యంగా కాంగ్రెస్‌ను గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మెడారపు సుధాకర్, తాళ్లపల్లి నరేష్, ఎండీ మహబూబ్‌పాషా, సుమన్ బాబా, కృష్ణ, రవీందర్, వినోద్, జానీపాషా, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఖమ్మంవన్‌టౌన్: ఎన్నికలు సమీపిస్తున్నా కొద్దీ కాంగ్రెస్ పార్టీలో చేరికల జోరు ఊపందుకుంటుంది. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో సింగరేణి మండలం గాదెపాడు గ్రామస్తులు మాజీ సర్పంచ్ కేతు స్వప్న సూర్యకుమార్, కోటమ్మ, రాంబాబు, వెంకన్న, అంజయ్య, సమ్మయ్య బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి లోక్‌సభ అభ్యర్థికి భారీ మెజార్టీని అందించాలని పువ్వాళ్ల కోరారు.

నామా గెలుపుతోనే జిల్లా అభివృద్ధి

తిరుమలాయపాలెం: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావు గెలుపుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలు మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పడమటితండా, హైదర్‌సాయిపేట, జల్లెపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీకి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పాలేరు ఇన్‌చార్జ్ జీవన్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, నాయకులు వెంకటేశ్వర్లు, మంచానాయక్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

రఘునాథపాలెం: బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం మండలంలోని చిమ్మపూడి గ్రామంలో మండల వైస్ ఎంపీపీ గుత్తా రవి ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతు సత్యనారాయణ, గొర్రె శ్రీనివాస్, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, దేశగాని నర్సయ్య, గుండ్ల ముత్తయ్య, మద్దుల నాగేశ్వరరావు, కంపసాటి వేణు, రాచర్ల రాముర్తి, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు రూ. 50 వేల దాణా వితరణ



దాణా అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: చైత్ర మాసం బహుళ అమావాస్య సందర్భంగా శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన బుధవారం నగరంలోని గొల్లగూడెంలో ఓం శ్రీ కృష్ణ గోశాలకు రూ. 50 వేల విలువైన దాణాను వితరణ చేశారు. నగర ప్రముఖులు, దాల్ మిల్ యజమానులు, గో ప్రేమికులు, శ్రీ స్తంభాద్రి సేవా సమితి సభ్యుల సహకారంతో సేకరించిన దాణాను గోశాల నిర్వాహకులకు అందించారు. కాగా, గోశాల నిర్వాహకులు దాణా దాతలకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాసరావు, సూరినేటి మల్లేశం, గజ్జి సూర్యనారాయణ, పులిపాటి సంపత్ కుమార్, వీవీ సుబ్బారావు, మోతుకూరి భద్రయ్య, చల్లా రమేష్, వంగవీటి శ్రీనివాసరావు, బిజ్జాల ఈశ్వరరావు, పెనుగొండ సాయికుమార్, వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రావు, నవీన్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అశ్వారూఢ హోమం



హోమం చేస్తున్న పూజారులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ శాస్తా దేవస్థానంలో 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వారూఢ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ తంత్రులు, పూజారులు సంప్రదాయ పద్ధతిలో, శాస్త్రోక్తంగా హోమం నిర్వహించగా.. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చిల్లంచర్ల రాధాకృష్ణ, రాయపూడి వెంకటరమణ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీని ఓడించాలి



మాట్లాడుతున్న అశోక్

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: రాజ్యాంగ పరిరక్షణకు బీజేపీ, దాని మిత్రపక్ష పార్టీలను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ కార్యదర్శి జి.రామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆవుల అశోక్‌లు పేర్కొన్నారు. నగరంలోని పారిశ్రామిక ప్రాంతం, రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలో రామయ్య ఆధ్వర్యాన కార్మికుల వద్ద కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందని రామయ్య పిలుపునివ్వగా.. ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాసు, ఏరియా నాయకులు బొమ్మకంటి రమేష్, కృష్ణ, శ్రీను, మల్లయ్య, వెంకన్న, సిల్వారాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వేపకుంట్లలో అశోక్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలు ఏర్పరిచి దేశాన్ని విభజించాలని చూస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, జిల్లా నాయకులు మంగతాయి, మండల కార్యదర్శి లక్ష్మణ్, రామనాథం, లక్ష్మణ్, ప్రేమ్‌సింగ్, బాబు, నరసయ్య, రామారావు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది..



మాట్లాడుతున్న బొడ్డు బొందయ్య

కూసుమంచి: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, తెలంగాణలో మాదిగ సమాజమంతా కాంగ్రెస్ వైపే ఉన్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అన్నారు. బుధవారం కూసుమంచిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన దళిత డిక్లరేషన్‌లో కూడా వర్గీకరణ అంశం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణను తాము స్వాగతిస్తున్నామని, కానీ మంద కృష్ణ మాదిగ బీజేపీ వైపే మాదిగ సమాజం అంతా ఉందని వ్యాఖ్యానించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని, ఇందుకు మాదిగల సహకారం సంపూర్ణంగా ఉంటుందని బొందయ్య అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, మాజీ ఎంపీపీ ఎడవెల్లి ముత్తయ్య, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ తదితరులు మాట్లాడగా.. ఎస్సీ సెల్ కన్వీనర్ జంగం లక్ష్మీనారాయణ, నాయకులు మైసయ్య, సత్యనారాయణ, మహిపాల్, కొండా శ్రీను, నాగేశ్వరరావు, రవి, ప్రసాద్, ప్రభాకర్, ఉపేందర్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరంగా మోదీ'



కూరగాయల మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరం మోదీ అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు షేక్ జానీమియ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించాలని బుధవారం సీపీఐ ఆధ్వర్యాన నగరంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద, కార్పొరేట్ బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించితేనే దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించబడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నరసింహారావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సీపీఐ జిల్లా సమితి సభ్యులు సాంబశివరెడ్డి, తాటి నర్మిల, సైదా, మేకల రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే మహ్మద్ సలాం ఆధ్వర్యాన సరిత క్లీనిక్ సెంటర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు.